క్లుప్తంగా

197 రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: మండలంలోని 197 రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ 96మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలిచ్చారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఏఎన్ఎం సరస్వతి, సిబ్బంది దివ్య, శశికళ, అనురాధ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయండి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈఓ రామ్‌నాయక్

గుడిపాల: విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీయాలని ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు. మండలంలోని తిమ్మయ్యపల్లె పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించి ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెబుతున్నారా లేదా అన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి రాబట్టారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక పుస్తకాలను తనిఖీచేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు ఆడుతూ పాడుతూ విద్యను బోధించాలన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

పాలసముద్రం : సైబర్ మోసాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్ఐ బిసురేష్ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో తమ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏఎస్ఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు కలసి మూడు గ్రూప్‌లో విడిపోయి మండలంలోని అన్ని గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. బ్యాంకు సిబ్బంది అంటూ వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు చెప్పవద్దని, ఓటీపీ చెబితే ఖాతాలోని నగదు ఖాళీ అవుతుందన్నారు. అలాగే రుణాలు ఇస్తామని సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు కలసి మెలసి ఉండాలని, రాజకీయ కక్షలు పెంచుకోవద్దని సూచించాలన్నారు.

మయూర వాహనంపై సుబ్రమణ్యేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లుకు అభిషేకాలు, విశేషాలంకరణలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా కర్పూరహారతులిచ్చారు.

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. దీనివల్ల శిశుమరణాల రేటు తగ్గింది. అయితే గర్భిణుల హాజరుశాతం తగ్గిపోవడంతో కారణాలు అన్వేషించే పనిలో పడింది. కేంద్రాల్లో వండి వడ్డించాలా? లేక సరుకులే ఇంటికి ఇవ్వాలా అనే అంశంపై క్షేత్ర స్థాయిలో సర్కారు సర్వే చేపట్టింది. ఈ సర్వేను అధికార యంత్రాంగం పారదర్శకంగా, దిగ్విజయంగా పూర్తి చేసింది.

- గర్భిణులు, బాలింతల మనోగతంపై సర్వే
- నివేదికలో నాలుగు అంశాల కూర్పు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకంగా పూర్తి చేసిన అధికార యంత్రాంగం

అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న పిల్లలు



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వడ్డించిన భోజనం



బువ్వ తింటావా.. బియ్యం కావాలా..?

పూతలపట్టు: ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం వండి వేడివేడిగా వడ్డించేవారు. కరోనా మహమ్మారి ఆ పరిస్థితిని దూరం చేసింది. తల్లులకు, పిల్లలకు డ్రై రేషన్ (సరుకులు) ఇంటికే అందించేవారు. ప్రస్తుతం మళ్లీ కేంద్రాల్లోనే వీరికి భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇక్కడే వంటి ఇంటికి తీసుకెళ్లి తినమన్నా స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో బాలింతలకు, గర్భిణులకు భోజనం ఏవిధంగా అందించాలన్న విషయంపై సర్వేకు శ్రీకారం చుట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు అంశాలతో కూడిన సర్వేను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం పూర్తయింది. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల పిల్లలు లోపాలతో పుడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. గతంలో బియ్యం, నూనె, పప్పు, పాలు, గుడ్లు నెలనెలా ఇంటికి అందించేవారు. అవి సక్రమంగా వినియోగం జరగడం లేదని కేంద్రాల్లోనే వండిపెట్టాలన్న నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నెలలు నిండిన గర్భిణులు కేంద్రాలకు నడిచి రావడం ఇబ్బందిగా మారడంతో బాక్సుల్లో భోజనం ఇంటికి తీసుకెళ్లవచ్చని ఆదేశాలు జారీ చేశారు. అయినా హాజరు శాతం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సర్వే చేపట్టింది. పూతలపట్టు మండలంలో 63 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో గర్భిణులు 265 మంది, బాలింతలు 205మంది, ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 1201 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు 580 మంది ఉన్నారు.

సర్వే వివరాలు ఇలా

గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం తింటారా? బాక్స్‌లో పెట్టుకొని ఇంటికి తీసుకెళతారా? రేషన్ సరుకులు ఇంటికే ఇస్తే బాగుంటుందా? తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాలలో గత రెండు వారాలుగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను లబ్ధిదారులు ద్వారా తెలుసుకొని కార్యకర్తలు వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం పూర్తయింది.

పక్కగా సర్వే చేశాం



గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయాన్ని పలుమార్లు అవగాహన కల్పించాం. అయినా చాలా మంది రావడానికి ఇష్టపడడం లేదు. దీనిపై సర్వే చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారి ఆదేశాల మేరకు లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్న వివరాలను ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. సర్వే పక్కాగా పూర్తయింది.

– నాగరత్నం, సూపర్ వైజర్

ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ



వసంతాపురంలో పింఛన్‌ను ఇస్తున్న వలంటీర్

గుడిపాల: మండలంలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచే వలంటీర్లు ఆయా గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. 27గ్రామ పంచాయతీలకు సంబంధించి 228 మంది గ్రామ వలంటీర్ల ద్వారా అధికారులు పింఛన్లను పంపిణీ చేశారు. సాయంత్రానికల్లా 87 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. మండలంలో 6,797 మందికి గాను 5,927 మందికి పింఛన్లను అందజేశామన్నారు. 5 గంటలకే ఇంటివద్దకు పింఛన్లు ఇవ్వడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆనందం వ్యక్తం చేశారు.

88.84 శాతం పింఛన్ల పంపిణీ



చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. వలంటీర్లు ఉదయం 9 గంటలకే 80 శాతం పింఛన్లు పంపిణీ చేయగా, సాయంత్రానికి 88.84 శాతం పూర్తయింది. మండల వ్యాప్తంగా 4,554 మంది పింఛన్‌దారులు ఉండగా 4046 మంది పింఛన్ అందుకున్నారని ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు.

ఉగాదికల్లా నిర్మాణాలు పూర్తి



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలను ఉగాదికల్లా పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి లబ్ధిదారులకు ఆదేశించారు. మండలంలోని వేపనపల్లి బుధవారం లే అవుట్లను పరిశీలించిన ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణపనులు వేగవంతం చేయాలని కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగంగా పుంజుకునేలా చర్యలు తీసుకకోవాలని తెలిపారు. ఉగాది నాటికి లబ్ధిదారులు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. అనంతరం తేనేపల్లిలోని ఉపాధి పనులు పరిశీలించారు. పనిచేస్తున్న కూలీల దగ్గర పనితీరును అడిగి తెలుసుకున్నారు. వారి కూలీ వివరాలను ఉపాధి హామీ పుస్తకంలో నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి సర్కారు పెద్దపీట



చిన్నారులకు క్రికెట్ శిక్షణ ఇస్తున్న కోచ్

నగరి : క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిని వెలుగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్థానిక కేవీకే మైదానంలో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పర్యవేక్షణలో క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. రెండేళ్లుగా జిల్లాలో ఎక్కడ చూసినా క్రీడా సంబరాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు, ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా పోటీలు జరుగుతున్నాయి. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా స్థాయిలో ఏదైనా క్రీడలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటే తప్ప ప్రోత్సాహం ఉండేది కాదు. ఇప్పుడు క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

శాప్ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ

క్రికెట్ ఆడాలన్న ఆసక్తి ఉన్న క్రీడాకారులకు స్థానిక కేవీకే మైదానంలో ఉచితంగా శిక్షణ అందించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. నైపుణ్యం ఉన్న శాప్ కోచ్‌లు ఎన్ఐఎస్, 'ఎ' లెవల్, 'బి' లెవల్ కోచ్‌లు క్రీడాకారులకు క్రికెట్ శిక్షణ ఇస్తారు. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించారు. క్రికెట్ శిక్షణ ఇవ్వడంతో పాటు ఆటపై అవగాహన, జట్ల ఏర్పాటు, బయట ప్రాంతాలకు తీసుకెళ్లి మ్యాచ్‌లు ఆడించడంతో పాటు వారికి ఫిట్‌నెస్ వ్యాయామాలు, యోగాలోను శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉదయం 5.45 నుంచి 8.30 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ ఇస్తున్నారు.

కార్మికులకు నూనె, సబ్బులు పంపిణీ



పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె పంపిణీలో అధికారులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. నగర కమిషనర్ జె అరుణ ఆదేశాల మేరకు, ఎంహెచ్వో లోకేష్, మెప్మా సీఎంఎం గోపి పర్యవేక్షణలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న 510 మంది కార్మికులకు 2022–23 సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్కరికి 3.5 లీటర్ల కొబ్బరి నూనె, 10 సబ్బులు అందించారు. కార్మికులకు నూనె, సబ్బులు తదితర వస్తువులను అందించడానికి పలుసార్లు టెండర్లు పిలిచినా, స్పందన లేకపోవడంతో కమిషనర్ అరుణ, జగనన్న మార్ట్ ద్వారా వస్తువులను కార్మికుల అందించడానికి చర్యలు తీసుకున్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. త్వరలోనే చెప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లె: వడదెబ్బ నివారణపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని దేవదొడ్డిలో బుధవారం వడదెబ్బ నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలు అధికంగా ఉంటాయని, ఆరు బయట తిరగరాదన్నారు. చెమట పట్టకపోవడం, మగతగా ఉండడం, తల తిరగడం, విపరీతమైన దాహం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు ఇంటిలోని పానీయాలు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం బాగా సేవించాలన్నారు. చల్లటి ప్రదేశంలో ఎక్కువసేపు ఉండాలన్నారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని మేకలనాగిరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న మేయర్ అముద



దర్శనమిస్తున్న వేణుగోపాలస్వామి

గుడిపాల: మండలంలోని చెరువుముందర వూరు గ్రామంలో వేణుగోపాలస్వామి భజన మందిర కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాణప్రతిష్ట, కరన్యాస నాడీసంధ్యానం, అంగన్యాస, నేత్రాన్మలనము, తృతీయపూజహోమం, సందర్శనహోమం, గోపూజ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, శిఖర కలశాభిషేకం, అలంకరణ, ధూపదీప నైవేద్యము వేదపండితులతో నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. దీనికి చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ పాల్గొన్నారు.

మామిడి పూతకు తెగుళ్ల బెడద



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు



మామిడి తోటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

- వేగంగా వ్యాపిస్తున్న తామర, తేనెమంచు పురుగు
- దిగుబడులపై ప్రభావం
- ఆందోళనలో మామిడి రైతులు

బంగారుపాళెం: వాతావరణంలో మార్పుల కారణంగా మామిడి తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. చలి, మంచు తీవ్రత తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం. అదే సమయంలో మామిడి తోటలు పూత దశలో ఉండటంతో తామర, తేనెమంచు పురుగు వేగంగా వ్యాపిస్తోంది. పూతలపట్టు నియోజకవర్గంలో దాదాపు 20 వేల హెక్టార్లలో మామిడితోటలు ఉన్నాయి. సుమారు 80 శాతం తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. పది రోజుల నుంచి మంచు, చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో తెగుళ్ల వ్యాప్తికి అనుకూలంగా మారింది. ముఖ్యంగా మామిడిలో తామర, తేనె మంచు, గొంగళి పురుగుల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. వీటి తాకిడితో పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు

మామిడి పూతకు తెగుళ్ల తాకిడి పెరగడంతో నివారణకు పురుగు మందుల వినియోగం అదే స్థాయిలో పెరుగుతోంది. ఈ క్రమంలో మామిడి రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. తేనె మంచు తెగులు వేగంగా వ్యాపిస్తుండడంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. కాయ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. పలుమార్లు మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. తోటల్లో పూత బాగానే వచ్చినప్పటికీ గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది తెగుళ్ల తాకిడి అధికంగా ఉంది. దాంతో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోతే ఈసారి నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

మామిడిలో వేగంగా వ్యాపిస్తున్న తామర, తేనెమంచు పురుగు, మసిమంగు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు అవసరమని ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. తోటల్లో ఎండు పుల్లలను తొలగించి చెట్ల పాదులతో పాటు తోట చుట్టూ కలుపు మొక్కలను నివారించాలన్నారు. తామర, గొంగళి, బంక కార్చే పురుగు నివారణకు టపుజ్ 2 మి.లీ. లేదా ఒడిస్ 2 మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. తేనెమంచు పురుగు నివారణకు టోకెన్02 మి.లీ లేదా చెస్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పండు ఈగ సమస్య నివారణకు ఎకరాకు ఒక మెర్క్యురీ లైట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

ఐరాల : రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ డీడీ ప్రభాకర్‌రావు సూచించారు. మండలంలోని అగరంపల్లెలో బుధవారం ఉచిత గాలికుంటు నివారణ టీకాల ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డీడీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. మండలంలో 540 పశువులకు టీకాలు వేశామన్నారు. 4 నెలల దూడ నుంచి, అన్ని రకాల పాడి పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు. వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని టీకాలు వేయడం వల్ల శాశ్వతంగా నివారించవచ్చున్నారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగపడుతుందన్నారు. పశువులు గుర్తింపునకు చెవి పోగు వేయటం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం మండల పశువైద్యాధికారులకు గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు పినాక పాణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటువ్యాధి టీకాలు

తవణంపల్లె: మండలంలోని 600 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. మండలంలోని దిగువ మోదలపల్లె, ఎగువ మోదలపల్లె, మోదలపల్లె కాలనీ, మైనగుండ్లపల్లె, మైనగుండ్లపల్లె దళితవాడలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం ఉచితంగా టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని రైతులు వెటర్నరీ అధికారులకు సహకరించి టీకాలు వేసుకోవాలని కోరారు. ఈ నెల 31వ తేదీ వరకు సాగుతుందని వివరించారు.

శ్రీరంగరాజపురం: పాడిపశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి అని పశువైద్యాధికారి డాక్టర్ కేపీ శ్రీవిద్య అన్నారు. మండలంలోని చిన్న తయ్యూరులో బుధవారం జాతీయ పశువ్యాధి నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు వ్యాపించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒక్కటని సూచించారు. ప్రతి ఒక్కరూ గాలికుంటు వ్యాధి నియంత్రణ టీకాలను సద్వినియోగం చేసుకుని పశువులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలపై పాడి రైతులు అపోహలను వీడి ముందుకు రావాలని సూచించారు. అనంతరం 92 పాడిపశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.



ఐరాల: టీకాలు పంపిణీ చేస్తున్న డీడీ ప్రభాకర్‌రావు



తవణంపల్లె: పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది